క్లుప్తంగా

ఘనంగా మొహర్రం



మహబూబాబాద్ రూరల్: ముస్లింల ప్రధాన పర్వదినాల్లో ఒకటైన మొహర్రం పండుగ ముఖ్యమైనదికాగా పండుగ వేడుకల్లో భాగంగా ఆదివారం ముస్లిం మత పెద్దలతో కలిసి వివిధ కూడళ్లల్లో డప్పు చప్పుళ్ల మధ్య పీరీల ఊరేగింపును నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో ఉర్సుగుట్టపై పీరీల మట్కీలకు భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో యూసుఫ్, మస్తాన్, షరీఫ్, షబ్బీర్, ఖాదర్ బాబా, పాషా, ఖయ్యూం, ఖాజా, ఫెరోజ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి పూజలు



మహబూబాబాద్ రూరల్/గార్ల: ఆషాఢమాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తూ జిల్లా వ్యాప్తంగా తొలి ఏకాదశి పూజలను భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచే భక్తులు దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు.

సీఏ కోర్సులో విద్యార్థి ప్రతిభ

డోర్నకల్: చార్టెడ్ అకౌంట్ నాలుగు సంవత్సరాల కోర్సులో ఆదివారం వెలువడిన ఫలితాల్లో డోర్నకల్ విద్యార్థి జాతీయస్థాయిలో 50వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబర్చాడు. నాయకులు సుశీల్‌కుమార్‌జైన్, శ్రీరాం నాయక్, మహేశ్వరీ సేవా సమాజ్ ప్రతినిధులు రమేష్‌లడ్డా, వేణులడ్డా, ద్వారకలడ్డా, గోపాల్ లడ్డా సన్మానించారు.

గిరిజన యువతికి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



తొర్రూరు రూరల్: మండలంలోని కస్నా తండాకు చెందిన బానోతు బుచ్చమ్మ, శ్రీను దంపతులకు చెందిన అనూష అనే యువతి ఈ ఏడాదిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్‌గా, ఐడీబీఐలో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్‌గా, ఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగాలు సాధించారు. ఆదివారం గ్రామస్తులు యువతిని అభినందించారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి



మహబూబాబాద్ అర్బన్/కేసముద్రం/తొర్రూరు రూరల్: జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్యామాప్రసాద్ చిత్రపటానికి నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్‌సుందర్‌శర్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డం అశోక్, చీకటి మహేష్, రాధాపటేల్, వెన్నమల్ల సందీప్, ఇరుకుళ్ల సురేందర్, కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్, ఓలం శ్రీనివాస్, పాదిల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక




గూడూరు: తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా జనావత్ సుమంత్, డివిజన్ ట్రెజరర్‌గా బోడ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 11 మానుకోట జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ కార్యాలయంలో నిర్వహించే యువగర్జన సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో నాయిని రంజిత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో యువకులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఈ యువ గర్జన సభ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్, జిల్లా నాయకులు ఆవుల వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి నర్సింగ్ వెంకన్న, మాజీ సర్పంచ్ షఫీ, బానోత్ దాము నాయక్, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌పై అడుగుకో గుంత

- బొద్దుగొండ సమీపంలో ప్రమాదకరంగా జాతీయ రహదారి
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



బొద్దుగొండ సమీపంలోని ఎన్‌హెచ్‌పై గుంతలు..

గూడూరు: రహదారి అంటే రయ్.. రయ్‌మంటూ వేగంగా వెళ్లొచ్చు అనేది వాహనదారులు, ప్రయాణికుల నమ్మకం. అదే జాతీయ రహదారి అంటే.. మరింత స్పీడ్‌గా తొందరగా వెళ్లొచ్చు అనేది మరో నమ్మకం. కానీ గూడూరు మండలం బొద్దుగొండ సమీప విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలోని జాతీయ రహదారి పరిస్థితి మాత్రం ప్రమాదకంగా మారింది. నర్సంపేట డివిజన్ మల్లంపల్లి నుంచి మహబూబాబాద్ మీదుగా ఐదు సంవత్సరాల క్రితం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 365) పనులు ప్రారంభమయ్యాయి. అందులో ఖానాపురం మండలం మంగళవారిపేట నుంచి మహబూబాబాద్ మండలం కంబాలపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ గూడూరు మండల కేంద్రంలోని నర్సంపేట వైపు పెట్రోల్ పంపు నుంచి మహబూబాబాద్ రోడ్డు వైపు తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైయిన్స్, డివైడర్ నిర్మాణాలు, సెంట్రల్ లైటింగ్ పనులు అసంపూర్తిగా నిలిచాయి. దీనికి తోడుగా మండలంలోని బొద్దుగొండ సమీప విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా హైటెన్షన్ విద్యుత్ లైన్ (ఓవర్ హెడ్ పవర్‌లైన్) ఉన్నందున సంబంధిత శాఖ అధికారులు అక్కడ పనులు జరపడానికి అభ్యంతరం తెలిపారు. దీంతో అక్కడ కొంత మేర రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పనులు నిలిచిన రోడ్డుపై ఎలాంటి పనులు జరగకపోవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు వేగంగా రావడం, అక్కడికి చేరుకోగానే గుంతలను చూసి ఒక్కసారిగా బ్రేక్ కొట్టి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ రోడ్డు దుస్థితిపై దృష్టి సారించి బొద్దుగొండ వద్ద గుంతలమయమైన రోడ్డు భాగంతోపాటు గూడూరు మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిన పనులను వెంటనే పూర్తిచేయించి జాతీయ రహదారిపై వాహనదారులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరికి చెప్పినా పట్టింపులేదు



బొద్దుగొండ శివారు సబ్‌స్టేషన్ ప్రాంతంలో హై పవర్ విద్యుత్ లైన్ కింద నిలిచిన రహదారి పనులపై ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. ఐదు సంవత్సరాలుగా ఇక్కడ గుంతలమయమైన రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేలు మాటలు తప్ప, చేతలు చూపడం లేదు.

– గజ్జి యాకయ్య, బొద్దుగొండ

ఉచిత విద్య అందడమే లక్ష్యం



నినాదాలు చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: దేశంలో ప్రతి విద్యార్థికి ఉచిత విద్య అందడమే లక్ష్యం అని డీఎస్ఎఫ్ఐ జాతీయ కన్వీనర్ డాక్టర్ వివేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కిరణవర్తక సంఘం భవనంలో ఆదివారం డీఎస్ఎఫ్ఐ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ హాజరై మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.8వేల కోట్లను విడుదల చేయాలన్నారు అనంతరం డీఎస్ఎఫ్ఐలోకి ఎస్ఎఫ్ఐ నుంచి భారీగా చేరికలను కండువా కప్పి ఆహ్వానించారు. సభ్యత్వ నమోదు, జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బుర్ర వీరభద్రం, కేలోతు సాయికుమార్, శాంతి కుమార్, గుగులోతు సూర్యప్రకాష్, అజ్మీరా వెంకట్, దేవేందర్, దిలీప్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్ పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీఐ రాజేష్

డోర్నకల్: యువత నిత్యం వ్యాయామం చేస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని డోర్నకల్ సీఐ బి.రాజేష్ కోరారు. స్థానిక సుభాష్‌వీధిలో ఏర్పాటు చేసిన బుల్లెట్ ప్రూఫ్ వ్యాయామశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. డోర్నకల్‌లో గత ఐదు దశాబ్దాలుగా వ్యాయామశాలల ద్వారా అనేక మంది క్రీడాకారులు వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ తదితర క్రీడల్లో జాతీయస్థాయిలో గుర్తింపు పొందారని తెలిపారు. యువతను సన్మార్గంలో నడుపుతూ శారీర దారుఢ్యాన్ని, క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఏర్పాటు చేసిన వ్యాయామశాలను యువత వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామశాల వ్యవస్థాపకులు రామకోటేశ్వర్‌రావు, అధ్యక్షుడు కె.దేవ్‌సింగ్, కోచ్ బుట్టి అశోక్, కాలా సురేందర్‌జైన్, డీఆర్‌యూసీసీ సభ్యులు లచ్చిరాంనాయక్ పాల్గొన్నారు.

దానకర్ణుడిని కోల్పోయిన దంతాలపల్లి

- గ్రామాభివృద్ధి కోసం 11ఎకరాల భూదానం



చిన్న వీరారెడ్డి (ఫైల్)

దంతాలపల్లి: తన జీవితం గ్రామాభివృద్ధి కోసం త్యాగం చేసి, నిరంతరం గ్రామాభివృద్ధి కోసం తన ఆస్తిని కూడా దానం చేసిన దంతాలపల్లి గ్రామ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నా వ్యక్తి ఎల్లు చిన్న వీరారెడ్డి(85) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన వీరారెడ్డి 1973–75 సంవత్సరాల మధ్య కాలంలో అప్పటి నర్సింహులపేట మండలం (ఇప్పటి దంతాలపల్లి) గ్రామాభివృద్ధిలో భాగంగా ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం రెండు ఎకరాల భూమి దానం చేశాడు. విద్యుత్ కేంద్ర నిర్మాణానికి మూడు ఎకరాల స్థలం విరాళంగా ఇచ్చాడు. గ్రామంలో ఎస్సీ కాలనీ నిర్మాణానికి సుమారు ఆరు ఎకరాల భూమి ఇచ్చి ఎస్సీలకు ఇళ్ల నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. రూ.30కోట్ల విలువ చేసే ఆస్తిని గ్రామాభివృద్ధి కోసం ఇచ్చిన ఆయన మృతితో దంతాలపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. గ్రామ ప్రజలు చివరిసారి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

విద్యుదాఘాతంతో పెంకుటిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పెంకుటిల్లు

గూడూరు: విద్యుదాఘాతంతో ఓ పెంకు ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచలో ఆదివారం జరిగింది. బాధితుడు చేరాల సోమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వడ్రంగి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఉదయం ఏకాదశి పండుగ సందర్భంగా భోజనం చేసి భార్యాభర్త కల్సి బయటికి వెళ్లారు. కొద్ది సేపటికి ఇంట్లో కరెంటు వైర్ మాడిన వాసన వచ్చి ఒక్కసారిగి భారీ మంటలు చెలరేగాయి. ఇల్లు కాలుతున్న సమాచారం అందుకున్న గ్రామస్తులు వెంటనే నర్సంపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మంటలు ఆర్పాలనుకున్నా ఫలితం లేకుండాపోయింది. వడ్రంగి పనులు చేసే చేరాల సోమయ్య ఇంట్లో ఫర్నిచర్ కర్ర, తయారు చేసిన పలు ఫర్నిచర్‌లు, బీరువా, ఇంట్లో ఉన్న పాత ఫర్నిచర్ కర్ర మొత్తం కాలిబూడిదైంది. సుమారు రూ. 8 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు చెబుతూ కన్నీటి పర్యంతమయ్యాడు. విద్యుదాఘాతంతో ఇల్లు కాలిన చేరాల సోమయ్యకు ఎమ్మెల్యే సహకారంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి బాధితుడికి భరోసా ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధిలో విఫలం



మాట్లాడుతున్న రమేశ్

పెద్దవంగర: పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిలో పాలకుర్తి ఎమ్మెల్యే విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొద రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కరాచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర నాయకులు లేగా రామ్మోహన్‌రెడ్డితో కలిసి రమేశ్ ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఇందిరమ్మ ఇండ్లు, ఇతర మౌళిక సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగు రాములు, పూసాల శ్రీమాన్, సాయిని ఝాన్సీ, నవీన్‌రెడ్డి, తలారి సోమయ్య, పైండ్ల రాజేష్, అనిల్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కురవి: మండల కెమిస్ట్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీరాం నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పుణ్యపుర్తి రమేష్‌యాదవ్, కార్యదర్శిగా కొత్త వీరన్న, సహాయ కార్యదర్శిగా కొర్ని చందు, కోశాధికారిగా ప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా రాపర్తి శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా నారాయణ, జాఫర్ ఖాన్ నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కురవి: కురవి మండలం రాజోలు గ్రామానికి చెందిన వీరోజు శ్రీలక్ష్మి(68)కి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా, మానుకోట ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై గంద్రాతి సతీష్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలు గ్రామానికి చెందిన వీరోజు శ్రీలక్ష్మి తన కొడుకు సురేంద్రాచారి ఇటీవల మృతి చెందాడు. శనివారం రాత్రి కురవి వీరభద్ర స్వామి గుడి వద్ద నిద్ర చేసి తెల్లవారుజామున కురవి నుంచి ఆటోలో మహబూబాబాద్‌కు వెళ్తున్నారు. కురవి శివారు లింగ్యాతండా సమీపంలో 365 జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన మృతురాలు శ్రీలక్ష్మిని మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడు మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మరిపెడ రూరల్: రోడ్డుపై ఏర్పాటు చేసిన బార్కెట్లకు ఓ ద్విచక్రవాహన దారుడు ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఎల్లంపేట స్టేజి సమీపంలోని 563 జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలంలోని మూడు తండాకు చెందిన వేణు అనే యువకుడు తన బైక్‌పై మరిపెడ మండల కేంద్రం వైపు వస్తున్నాడు. కింద పడి ఉన్న బారికేడ్‌ను బైక్ ఢీ కొట్టింది. యువకుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం

మహబూబాబాద్ అర్బన్: కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో అక్కెనపల్లి పెద్ద యాకయ్య మృతి చెందిన క్రమంలో ఆదివారం ఎమ్మెల్యే మురళీ నాయక్ యాకయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, సుదర్శనచారీ నర్సింహారెడ్డి, నమ్మ నర్సయ్య, రవీంద్రచారీ, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు షరబత్ పంపిణీ

మహబూబాబాద్ రూరల్: మొహర్రం పండుగ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త మనవళ్లు హస్సేన్ హుస్సేన్ చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ పట్టణంలోని కోర్టు సెంటర్ సమీపంలో ముబీన్ చికెన్ సెంటర్ అధ్యర్యంలో ఆదివారం భక్తులకు షరబత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్, మతిన్ పాల్గొన్నారు.

ఒకే రోజు పండుగను జరుపుకోవాలి

మరిపెడ రూరల్: ఈనెల 8వ తేదీన గిరిజనుల ఆరాధ్యదైవం అయిన సీత్లాభవాని పండుగను ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకోవాలని లంబాడీల ఐక్యవేదిక (లైవ్) మరిపెడ మండల కోఆర్డినేటర్ గుగులోతు దేవేందర్ గిరిజనులకు ఆదివారం సూచించారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

మరిపెడ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జ్యోతిబసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈమేరకు మరిపెడలో డోర్నకల్ ఎమ్మెల్యే లేకపోవడంతో క్యాంపు కార్యాలయం గేటుకు వినతిపత్రాన్ని ఉంచి నిరసన వ్యక్తం చేశారు.

డీజిల్ లేక మూలనపడ్డ జీపీ ట్రాక్టర్

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గిరిపురం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డీజిల్ లేక మూలన పడ్డది. చేసేది లేక జీపీ సిబ్బంది వీధులను శుభ్రం చేసి సేకరించిన చెత్తను బస్తా ద్వారా ఆరుబయట పారబోస్తున్నారు. చెత్తకుప్పలు పేరుకపోయి వర్షాలు కురుస్తున్న తరుణంలో దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు వ్యాపించే అవకాశం ఉందని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు.

రెయిన్ కోట్ల పంపిణీ

తొర్రూరు: సామాజిక సేవా కార్యక్రమాలకు స్థానికులు సహకరించాలని లయన్స్ సేవా తరుణి అధ్యక్షుడు తుమ్మూరు శ్రీదేవిరెడ్డి అన్నారు. సేవా తరుణి ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలో హమాలీ కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు కూన పద్మావతి, వేముల మంజుల, మోహన్‌రెడ్డి, రాజసు కన్య, ఉమారెడ్డి పాల్గొన్నారు.

ఓబీసీ మీడియా కోఆర్డినేటర్‌గా నానియాదవ్



డోర్నకల్: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా దాసరి నానియాదవ్ నియమితులయ్యారు. ఆదివారం డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ నియామకపత్రాన్ని అందించారు.

కేసీఆర్ పాలనలోనే చెరువుకు అన్యాయం

బయ్యారం: కేసీఆర్ పాలనలోనే బయ్యారం పెద్ద చెరువుకు అన్యాయం జరిగిందని సొసైటీ అధ్యక్షులు మధుకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆరోపణలు చేయటం తగదని బయ్యారం పెద్దచెరువు అభివృద్ధి, ఉక్కుపరిశ్రమ నిర్మాణం కోసం బీఆర్ఎస్‌లో చేరినట్లు ప్రకటించిన హరిప్రియ ఏమి చేసిందని ప్రశ్నించారు.

విత్తనాల పంపిణీ

కొత్తగూడ: మండలంలోని కొత్తపల్లి గ్రామస్తులకు పెరటి కూరగాయ విత్తనాలను వనవాసి కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా పరిషత్ మండల అధ్యక్షుడు వట్టం రమేష్ మాట్లాడుతూ.. బయటి మార్కెట్‌లో రసాయనాలు స్ప్రే చేసిన కూరగాయలు తినడం వల్ల అనేక రోగాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వీరభద్రస్వామి, సుమలత, వాసం రమేష్, మల్లెల రామయ్య పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

గూడూరు: కార్మిక రంగంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 9న చేపడుతున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి పానుగంటి నర్సయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బానోతు లాలు, మర్రిపెల్లి మొగిళి, ప్రియాంక, మొగిళి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ రామకృష్ణకు బాలుడు ఏడుస్తూ కనిపించగా అతడిని ఆదివారం టౌన్ పోలీసు స్టేషన్ తీసుకువచ్చారు. సదరు బాలుడి ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించగా హోంగార్డ్ రామకృష్ణను సీఐ అభినందించారు.

దయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం స్థానిక విశ్రాంతి భవనంలో వివిధ పార్టీల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆలకుంట్ల సాయన్న, పుల్లయ్య, బాబు గౌడ్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

నర్సింహులపేట: మండలంలో పోగొట్టుకున్న సుమారు రూ.లక్ష విలువ గల నాలుగు సెల్‌ఫోన్లను ఫిర్యాదు చేసిన బాధితులకు పీఎస్‌లో ఎస్సై మాలోతు సురేష్ ఆదివారం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం 2005–06 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. మిత్రులంతా పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. నాడు విద్యను బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు.

కార్పొరేట్‌కు ఊడిగం చేస్తున్న మోదీ సర్కారు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కురవి: కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ ఊడిగం చేస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా సీపీఐ మహాసభల సందర్భంగా మండల కేంద్రంలోని ఓం ఫంక్షన్ హాల్‌లో ప్రతినిధుల సభకు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మోదీ పాలనలో ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తూ ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో ముందుకు సాగుతున్నారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజాసంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలను గాలికి వదిలి అధికార, విపక్ష పార్టీలు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీకి రావాలని, లేదంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర రావు, జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్ సారథి, నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్; కర్నం రాజన్న, నెల్లూరి నాగేశ్వర్‌రావు నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, తురక రమేష్, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నిరంగాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న శ్రీరాములు

తొర్రూరు: బీజేపీతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ చేనేత సెల్ జాతీయ నాయకుడు వన్నాల శ్రీరాములు అన్నారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీరాములు మాట్లాడారు. ప్రధాని మోదీ దేశానికి సుస్థిర పాలన అందిస్తున్నాడని, మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశాన్ని ఉగ్రమూకల నుంచి రక్షించాడన్నారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ సంక్షోభంలో పడిందని, చేనేత సంఘానికి వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, కుమార్, రవిబాబు, సందీప్, సంతోష్, రాజు పాల్గొన్నారు.

ఊరూరా బోనాల వేడుకలు



బీరన్న ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు



సమర్పించిన నైవేద్యాలు

గూడూరు: మండల కేంద్రంలోని గొల్లగూడెంతోపాటు గాజులగట్టు, పలు గ్రామాల్లో గొల్ల కురమలు ఆదివారం బీరన్న బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం తొలిఏకాదశి పర్వదినాన వారి ఇలవేల్పు అయిన బీరన్న, కామరాతి అక్క మహంకాళి దేవతకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఆ క్రమంలో ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాలు ఎత్తుకొని వెళ్తుండగా, కుల పెద్దలు మేళతాళాలు, డప్పుచప్పుళ్లతో దేవాలయం చేరుకున్నారు. బోనాలు చెల్లించి, నైవేద్యాలు సమర్పించి వేడుకున్నారు.